# అది ఒక ఇదిలే

— పెనుమాక నాగేశ్వరరావు

"హలో రమాకాంత్! రెడీనా?"

"ఎస్ బాస్, వచ్చేస్తున్నా" అంటూనే కారేజీ పెట్టిన బ్యాగ్ భుజానికి తగిలించుకుని బయటపడ్డాను.

రమాకాంత్ స్కూటర్‌మీద ఇద్దరం ఆఫీసుకు ప్రయాణం అయ్యాం.

ఆఫీసుకు చేరుకునే సరికి ఇంకా కొంతమంది కొలీగ్స్ వచ్చి ఉన్నారు. మరో పది నిముషాలు టైం ఉండటంతో అందరం ఆఫీసు బయట ఖాళీ స్థలంలో నిలుచున్నాము కబుర్లు చెప్పుకుంటూ.

ఇద్దరు ముగ్గురు మాత్రం పేపర్లు చదువుకుంటూ మాకు కొద్ది దూరంగా నిలబడి ఉన్నారు.

రాజకీయాలు, సినిమాలు, మా డిపార్ట్‌మెంట్‌లో లోటుపాట్లు వగైరా వగైరా విషయా లన్నీ దొర్లిపోతున్నాయి మా మాటల్లో.

అంతలోనే రోడ్డు మీద బస్ ఆగింది. బస్సులో నుంచి ముగ్గురు ముద్దుగుమ్మలు దిగి పైట లో సారి సరిచేసుకుని, హేండ్‌బాగ్ లూపుకుంటూ మా ఆఫీసు ముందుగా నడిచి వెళ్ళారు. వాళ్ళంతా మా ఆఫీసుకు పక్కనే ఉన్న మరో ఆఫీసు స్టాఫ్.

"ప్చ్! ఆఫీసంటే అలా ఆడపడుచుల్తో కళకళ లాడుతుంటే బాగుంటుంది. మన ఆఫీసూ ఉన్నది ఎందుకు? ఒక్కరంటే ఒక్కరైనా ఆడమనిషంటూ లేదు కదా?" నిరాశనంతా వెళ్ళగక్కాడు రాజేష్.

ఆఫీసు టైం కావడంతో అందరం లోపలికి నడిచి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టేసి ఎవరి సీట్లో వాళ్ళం కూర్చున్నాం.

"నిజమే గురువుగారూ. మీరు చెప్పినట్లు మన ఆఫీసులో ఒక్కళ్ళయినా ఆడ మనిషి లేదేం కర్మండీ బాబూ?" అన్నాడు రాజేష్ పక్క సీటుల్లో కూర్చున్న గోపాల్రావు.

"అదే కర్మమో, ఆ రోజుల్లో కాలేజీలో చదువుకునేటప్పుడు కూడా ప్రత్యేకించి మా క్లాసులో అమ్మాయిలే ఉండేవారు కాదు. మిగత సెక్షన్స్‌లో అందంగా అమ్మాయి లుంటె మేం దిగాలుగా కూర్చోవాల్సి వచ్చేది క్లాసుల్లో. అదే ఆనవాయితీ తప్పకుండా ఆఫీసులో కూడా ఆడగాలి లేకుండా అయింది." గోడు వెళ్ళబోసుకున్నాడు మరో గుమాస్తా.

"ఉండాలి గురూగారూ, కనీసం ఒక్కళ్ళయినా ఆడవాళ్ళుంటే ... అ దో కళ, కాలక్షేపం కూడా. ఏమంటారు?" అని పళ్ళికిలించాడు పరాత్పరం.

"ఉండాల్సిన మాట నిజమే. కాని మన చేతుల్లో ఏముంది?" నసిగాడు నారాయణ.

"ఆఁ.. ఏమిటయ్యా, ఇందాకట్నుంచి ఆడాళ్ళు లేరు, ఆడాళ్ళు లేరో అని ఒకటే ఇదైపోతున్నారు. ఉంటే ఏ మవుతుందట? వాళ్ళొస్తే ఏదైనా కొత్తగా ఒరగబెడతా రా? జరుగుతున్న ఈ కాస్త పని కూడా పెండింగ్‌లోకి మారిపోవటం తప్ప ప్రయోజనం ఏమీ ఉండదు." అనుభవజ్ఞుడిలా చెప్పాడు సీతాపతి.

అలా అలా ఆడంగు లేని మా ఆఫీసును గురించి కలవరపడిపోతున్న మా అందరికీ ఓ అహ్లాదకరమైన వార్త చెవిన పడింది - విజయవాడ నుంచి విశాల అనే ఆవిడ బదిలీ అయ్యి మా ఆఫీసుకు వచ్చేస్తోందట.


ఆవిడగారితో ఒక రిద్దరికి తప్ప ఎవరికీ ముఖ పరిచయా ల్లేవు. ఆ ఒకరిద్దరిక్కూడా మనిషి తెలుసునేగాని పరిచయాలు మాత్రం లేవు.

అందరి మనసుల్లోనూ ఏదో వింత, కొత్త సంబరం. ఆవిడ-రూపు రేఖల్ని గురించి ఆత్రంగా ముచ్చటించుకున్నారు. ఆవిడగారి రాకకోసం ఎవరికి వారే వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు.

కొందరైతే ఆ మర్నాటి నుంచే రోజు కంటే ఫ్రెష్‌గా, నీట్‌గా అలంకరించుకుని వచ్చారు. వాళ్ళని చూసి చనువున్న వాళ్ళు చిలిపి కామెంట్లు చేసి, ఎగతాళి చేశారు.

అలా రెండు వారాలు గడిచేటప్పటికి అందర్లోనూ రకరకాల మార్పులైతే వచ్చినాయి గాని, విశాల మాత్రం రాలేదు.

"ఆవి డింకో మూడు నెలలగ్గానీ రాదండీ బాబూ! ఏవో ఫేమిలీ ప్రాబ్లమ్స్ ఉన్నాయట. అప్పటి వరకూ లీవ్‌లో ఉందట." తెలిసొ,



తెలియకో చెప్పేశాడు గోపాల్రావు.

అందరూ అతని వంక చాలా క్రూరంగా చూశారు. ఎలాగైనా అతను చెప్పింది నిజం కాదు - అనిపించాలని ఉన్నది వాళ్ళకి.

"ఆవిడకు ఈ ఊరు రావడం ఇష్టం లేదట. హైదరాబాద్‌కి బదిలీ కావాలని అప్లికేషన్ పెట్టుకున్నదట. అందుకే ఇంకా వచ్చి జాయిన్ కాలేదు." మరో వార్త చేరవేశాడు వరాత్సరం.

'వరాత్సరాన్ని చావగొట్టేస్తే ఎలా ఉంటుంది' అనే ఆలోచన అందరికీ ఒకేసారి కలిగినట్లు చూసి, నిర్లిప్తంగా ఉండిపోయారు.

నిరాశా నిట్టూర్పుల మధ్య కాలం గడుపుతున్నారు. అలాంటి సమయంలో ఒకరోజు విశాల రావడం, డ్యూటీలో జాయిన్ కావడం జరిగిపోయాయి. స్టాఫ్ అందరికీ పరిచయం చేసే కార్యక్రమం గోపాల్రావుకు అప్పగించటం జరిగింది.

చిరునవ్వులతో నమస్కార, ప్రతి నమస్కారాలు అయిపోయినాయి. ఆవిడ సీటు రమాకాంత్ సీటు పక్కన ఏర్పాటు చేశారు.

విశాల అందగత్తె కాకపోయినా అనాకారి మాత్రం కాదు. మితభాషిణీ, మాటలు తక్కువ - పని ఎక్కువ అని అర్థం అయింది.

అందరూ ఏదో రకంగామెతో మాట్లాడా లనే ప్రయత్నం. అవసరం ఉన్నా లేకపోయినా ఏదో ఒక పని మిషతో కాసేపు ఆమెతో ముచ్చట్లాడడం, అటు తర్వాత ఆవిడ పనిలో సాయం చేయటం ప్రారంభించారు కొందరు.

అందర్నీ అర్థం చేసుకుని ఉంటుంది విశాల. ఆడమనిషి కదా! తను మాత్రం ఎవరికీ అర్థం కాలేదు. తన పని చేసి పెట్టే వారి సంఖ్య రోజు రోజుకు ఎక్కువ కావడంతో, పూర్తి విశ్రాంతి తీసుకుంటూ తన సీటులో పెండింగ్ వర్క్ ఏమాత్రం లేకుండా చేసుకో గలుగుతోంది విశాల.

ఓ రోజు ఆఫీసుకు వచ్చిన అరగంటకు ఓ చిన్న సంచలనం సృష్టించా రందరూ.

"కర్చీఫ్ ఎక్కడో పడినట్లున్నదే" అని తనలో తనే గొణుక్కుంది విశాల.

అంతే, పక్క సీటు రమాకాంత్ ఆ విషయాన్ని ఓ పెద్ద సమస్యగా సృష్టించి ఆ ప్రాంతమంతా వెతకడం ప్రారంభించాడు.


అతన్ని చూసి, గోపాల్రావు ముఖద్వారం దాకా వెళ్ళి ఆమె వస్తున్నప్పుడు దారిలో ఏమైనా పడిపోయిందేమో అన్న అనుమానాన్ని తీర్చుకుని వచ్చాడు. ఇద్దరు ముగ్గురు లంచ్ రూమ్‌లో చూసొచ్చారు. కానీ కర్చీఫ్ కనిపించలేదు.

అంతలోనే రమాకాంత్ దృష్టి ఆమె ఒడిలో పడింది.

"అదిగో మేడమ్! కర్చీఫ్ మీ ఒడిలోనే ఉందిగా" అన్నాడు మహదానందంగా.

"ఈజిట్?" అని ఆశ్చర్యపోతూ చీర కుచ్చిళ్ళ మధ్య దాగిన కర్చీఫ్‌ను చూసుకుని 'థాంక్స్' చెప్పింది రమాకాంత్‌కు.

"ఇంతమందిమీ పని వదిలిపెట్టి కర్చీఫ్ కోసం వెతికితే, నీ కొక్కడికీ థాంక్స్ చెప్పటంలో ఆమె ఉద్దేశం ఏమిటట?" అంటూ ఉక్రోషంగా




రమాకాంత్‌ను నిలదీశారు గోపాల్రావు వగైరాలు.

"అరె బాగుందయ్యా! ఆ విషయం న న్నడిగితే - నే నేం చెప్తాను? ఆమెనే అడక్కపోయారా?" మరి కాస్త ఉడికించాడు రమాకాంత్.

** ** **

ప్రమోషన్ వచ్చి వరాత్సరానికి మరో ఊరు బదిలీ అయిన సందర్భంగా పార్టీ ఏర్పాటు చేశాడు ఆఫీసులో.

"స్వీటు ఏం తెప్పించమంటారు మేడమ్?" అడిగాడు వరాత్సరం.

కాసేపు బ్రతిమాలించుకున్నాక బాదం హల్వా తెప్పించమన్నది విశాల. మిగతా అందరం వంతం కొద్దీ పాలకోవానే తెప్పించమని బలవంతం చేశాం వరాత్సరాన్ని.

మే మంత ఆటలు పట్టిస్తాం అనుకున్నాడేమో తెలీదు కాని, మొత్తానికి పాలకోవాలే తెప్పించాడు అతగాడు.

పార్టీలో పాలకోవా మాత్రం తీసుకోకుండా మూతి ముడుచుక్కూర్చున్న విశాలను అందరూ గమనించకపోలేదు కాని, వరాత్సరం అవస్థ చూస్తే మాత్రం నవ్వొచ్చేసిం దందరికీ.

ఆ రోజు రాత్రే ఓ కిలో బాదం హల్వా పొట్లం వరాత్సరం స్వయంగా విశాల ఇంటికి వెళ్ళి అందించినట్లు ఓ గాలి వార్త చెలరేగింది కూడా.

వరాత్సరం ప్లేసులోకి కాకినాడ నుంచి కాంచన అనే ఆవిడ వస్తున్నదట. 'అంటే చిన్నగా ఒకరికి ఇద్దరు ఆడవాళ్ళు అవుతున్నా రన్నమాట ఆఫీసులో' అనుకుని ఆనందపడిపోయా రందరూ. అంతే కాదు, విశాలంటే విముఖత్వం ఉన్న వాళ్ళంతా కాంచనను మంచి చేసుకోవా లనుకున్నారు. ఆ ఇద్దరి ఆడవారి వల్ల ఆఫీసులో ఇప్పుడు రెండు వర్గాలు.

కాంచన రావడం, ఆఫీసులో అందర్నీ చదివేయటం అనతి కాలంలోనే జరిగిపోయాయి.

విశాల, కాంచన స్నేహంగా ఉంటున్నారు. ఆ ఇద్దరూ అందరితోనూ మంచిగానే మాట్లాడుతున్నారు. విశాల మాదిరిగానే కాంచనకు కూడా తను కష్టపడకుండానే పనులన్నీ పూర్తయిపోతున్నాయి.

కాంచన విశాల లాగా మిత భాషి కాదు. ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటుంది. అందరితోనూ ఫ్రీగా, హాయిగా నవ్వేస్తూ మసలుకొంటుంది.

మరో రెండు నెలలకు మా సెక్షన్ హెడ్ రిటైరైన సందర్భంగా ఓ చిన్న పార్టీ ఏర్పాటు చేస్తే కాంచన ఉపన్యాసం ఇచ్చింది కూడా.

రాజేష్ చాలా కాలం క్రితం పెట్టుకున్న రిక్వెస్ట్ ట్రాన్సఫర్ ఇంత కాలానికి శాంక్షన్ అయింది. ఆనందంగా సొంత ఊరు వెళ్ళిపోయా డతను.

సెక్షన్ హెడ్ స్థానంలోనూ, రాజేష్ స్థానంలో కూడా ఇద్దరూ ఆడవాళ్ళే వచ్చారు. ప్రస్తుతం మా ఆఫీసులో ఆడవారి సంఖ్య నాలుగుకు పెరిగింది.

రమాకాంత్ భార్య వేరే ఆఫీసులో ఉద్యోగిని. ఆవిడని మరో ఊరికి బదిలీ చేయడంతో

తప్పనిసరై తను కూడా ఆ ఊరికి ట్రాన్సఫర్ చేయించుకుని వెళ్ళిపోయాడు రమాకాంత్.

మూడు సిగలు ఓ చోట చేరితేనే ప్రమాదం అన్నారు పెద్దలు. మరి మా ఆఫీసులో ఉన్న నాలుగు సిగల మధ్య మనస్పర్థలు, కీచులాటలు ప్రారంభమైనట్లు గుసగుసలు ప్రారంభ మయ్యాయి.


ఎలాగైతే నేం రమాకాంత్ స్థానాన్ని కూడా ఓ మహిళా రత్నమే భర్తీ చేసింది.

ముసలి ప్రాణి నారాయణరావుగాకు, నేను తప్ప మిగిలిన వారంతా కూడా తలా ఓ కారణంగా ఆ ఆఫీసు నుంచి వెళ్ళిపోయారు. మిగిలిన వారంతా మహిళలే.

ఆఫీసు కళకళలాడుతున్న మాట నిజమే. దానితోపాటు వారి మధ్య సయోధ్య నశించి, కలవరపరుస్తున్న మాట కూడా యథార్థమే.

నారాయణరావుగారి రిటైర్మెంటు అయిన కొంత కాలానికే వేరే మోజు పడిన ఉద్యోగం రావడంతో ప్రస్తుతం చేస్తున్న జాబ్‌కు రాజీనామా ఇచ్చి బయటపడ్డాను నేను కూడా.

అందరూ మహిళా మణులతో కళకళలాడిపోతున్న ఆ ఆఫీసులో వారంత 'అందరూ ఆడవాళ్ళే అయ్యేటప్పటి'



పొద్దస్తమానం అత్తగారి ఆరళ్ళ గురించీ, ఆడపడుచుల అధికారం గురించి, అవీ కాకపోతే పట్టు చీరల గురించి, ఆర్గండీ వాయిల్ గురించి తప్ప వేరే కబుర్లే వినవడవు. అదీ కాక పదిమంది ఆడవాళ్ళు కలిసి కబుర్లాడుకుంటే మూతి విరుపులు, ముక్కు చీదటాలు పరిపాటి కదా.

అందుకే ప్రతిరోజు వాళ్ళంత ఏమనుకుంటున్నారో తెలుసా?

"అబ్బా! ఏమి ఆఫీసో ఏమిటో విసుగుపుడుతున్న దండీ, ఒక్క మగ పుంగవుడైనా ఉంటే కాస్త నయంగా ఉండేది" అంటూ కలవరపడిపోతున్నారు పాపం, వాళ్ళందరూ. ★